ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
3★★★ జిల్లా వార్తలు
మంగళవారం 21 మే 2024



వేసవి శిబిరం.. క్రీడలకు ఊతం
- వాలీబాల్, కబడ్డీ, క్రికెట్‌లో శిక్షణ - 6లో..

రైతాంగాన్ని
రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి - 6లో..

రుణమాఫీపై ఆశలు



- బ్యాంకర్ల నుంచి వివరాలు సేకరిస్తున్న ప్రభుత్వం
- ఆగస్టు 15 వరకు మాఫీ చేస్తామని హామీ
- 2019 ఏప్రిల్ 1 నుంచి 2023 డిసెంబరు 10వ తేదీ వరకు వర్తింపు
- 2023-24 ఆర్థిక సంవత్సరంలో 61,234 మంది రైతు ఖాతాలు
- రూ.702.36 కోట్ల రుణాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

అన్నదాతలకు కొత్త ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీ హామీపై ఆశలు చిగురిస్తున్నాయి. శాసనసభ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. దానికి అనుగుణంగానే ఆగస్టు 15 వరకు రుణమాఫీ చేయడానికి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. దీనికి అనుగుణంగానే రాజన్న సిరిసిల్ల జిల్లాలో రుణమాఫీకి అర్హత ఉన్న వివరాలను సేకరిస్తున్నారు. ఈ బాధ్యతలను రాష్ట్ర సహకార బ్యాంక్ అధికారులకు అప్పగించారు. ఏ బ్యాంక్‌లో రైతులు ఎన్ని రుణాలు తీసుకున్నారు? ఎంత వడ్డీ చెల్లించాలి వంటి లెక్కలు తీస్తున్నారు. రుణమాఫీ అమలు కోసం ప్రభుత్వం కటాఫ్ తేదీని నిర్ణయించింది. దీని ప్రకారం 2019 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2023 డిసెంబరు 10 వరకు బ్యాంక్‌ల నుంచి రూ.2లక్షల వరకు రుణం తీసుకున్నవారంతా రుణమాఫీకి అర్హులుగా గుర్తిస్తారు. దీని ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2023 - 2024 ఆర్థిక సంవత్సరంలో 61234 మంది రైతులు రూ 702.36 కోట్ల వ్యవసాయ రుణాలు తీసుకున్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజు నాటికి పూర్తి చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

స్థానిక ఎన్నికలపై ప్రభావం చూపేనా?

పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగియడంతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. జిల్లాలో వరుసగా వచ్చే సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్, ఎన్నికలపై దృష్టి సారించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలతో ముడిపడి ఉన్న సర్పంచ్, జడ్పీటీసీ, ఎన్నికలపై రైతులకు అందించే రూ.2 లక్షల రుణమాఫీతో కాంగ్రెస్ అభ్యర్థులకు లబ్ధి చేకూరుతుందని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. మరోవైపు స్థానిక ఎన్నికలపై రుణమాఫీ ప్రభావం అంతగా ఉండకపోవచ్చని ప్రతిపక్ష పార్టీల నేతలు అభిప్రాయ పడుతున్నారు. అధికారంలోకి వచ్చినా కాంగ్రెస్ స్థానిక సంస్థల్లో తమ జెండానే ఎగిరేలా కసరత్తు చేస్తోంది.

గత ప్రభుత్వంలో 61,773 మంది రైతులకు లబ్ధి

గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష రూపాయల లోపు రుణమాఫీ హామీ ఇచ్చి నాలుగు విడతలుగా మాఫీ ప్రక్రియ చేపట్టింది. 2014 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2018 డిసెంబరు 11వ తేదీ వరకు రుణం తీసుకున్న వారికి వర్తింపజేశారు. తొలి విడతలో రూ.25 వేల లోపు ఉన్నవారికి మాఫీ చేశారు. రెండో విడతలో రూ. 50 వేల లోపు ఉన్నవారికి, మూడో విడతలో రూ.50 నుంచి లక్షలోపు ఉన్నవారికి మాఫీ చేసినా పెద్దగా ప్రయోజనం చేకూరలేదని, రైతుల వడ్డీకే సరిపోయిందనే విమర్శలు వచ్చాయి. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో 61,773 మంది రైతులు లక్ష రుణమాఫీకి అర్హులుగా ప్రకటించి మాఫీ చేశారు.

విద్యుత్ తీగలపై విరిగిపడిన చెట్టుకొమ్మ



విద్యుత్‌వైర్లపై పడి ఆగిన చెట్టుకొమ్మ

వేములవాడ టౌన్, మే 20: విద్యుత్ తీగలపై విరిగిపడిన చెట్టుకొమ్మ ప్రమాదకరంగా వేలాడుతోంది. వేములవాడ పట్టణంలోని సెస్ కార్యాలయం నుంచి రెండో బైపాస్ వెళ్లే మార్గంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఇంటికి వెళ్లే సాయినగర్ చౌరస్తాలో మూడు రోజుల క్రితం భారీ ఈదురుగాలులకు చెట్టు కొమ్మ విరిగి విద్యుత్‌వైర్లపై పడింది. ఎప్పుడు కిందపడుతుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని, చెట్టుకొమ్మను తొలగించాలని కోరుతున్నారు.

పక్కా ప్రణాళికతో పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 20: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతు పనులను పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేయాల్సిన మరమ్మతు పనులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఎన్ఐసీ హాలులో జిల్లాలోని ఈఈలు, ఎంపీడీఓలు, ఏఈలతో సోమవారం సమీక్షించారు. పాఠశాలల్లో నీటి సరఫరా, విద్యుత్ పరికరాల ఏర్పాటు, మరుగుదొడ్ల మరమ్మతు, నీటి సదుపాయం, పాఠశాలల ఆవరణలో మరమ్మతు వంటి పనులపై చర్చించారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, జడ్పీ సీఈవో ఉమారాణి, డీఈవో రమేష్ కుమార్, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ ఈఈ అనిత సింగనాథ్, డీపీవో వీర బుచ్చయ్య, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్, ఇరిగేషన్ ఈఈ అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే మెరుగైన విద్య



ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

ఎల్లారెడ్డిపేట, మే 20: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లోని తిమ్మాపూర్, గొల్లపల్లి, నారాయణపూర్, సముద్రలింగాపూర్, గజసింగవరం గ్రామాల్లో సోమవారం అధ్యాపకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి సర్కారు కళాశాలలోని వసతులను వివరించారు. అనుభవం కలిగిన అధ్యాపకులు, ఉచిత పుస్తకాలు, విశాలమైన తరగతి గదులు, మైదానం, ఉపకార వేతనం, ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రైవేటు కళాశాలల్లో చేరి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు. ప్రభుత్వ కళాశాలలో పిల్లలను చేర్పించి ఉన్నత విద్యకు దోహదపడాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు పర్శరాములు, చంద్రమౌళి, విష్ణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

కోనరావుపేట, మే 20 : కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99 సంవత్సరం పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు సోమవారం ఆత్మీ సమ్మేళనం నిర్వహించారు. 45 మంది పూర్వ విద్యార్థుల 25 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో గురువులు అంకుష్, నరసింహచారి, హనుమంతరావు, శ్రీనివాస్, శ్రీధర్, కొండమాచారి, వినయశీల, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

దోస్తీ మీట్-2024 మండల స్థాయి క్రీడలు

సిరిసిల్ల క్రైం, మే 19: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో దోస్తీమీట్ 2024 మండల స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మాట్లాడారు. ఈ నెల 23 నుంచి పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. కబడ్డీ, వాలీబాల్ పోటీలలో ఆసక్తి ఉన్న యువతీ, యువకులు ఈ నెల 22లోగా మండల పోలీస్‌స్టేషన్‌లలో వివరాలను నమోదుచేసు కోవాలన్నారు. మండలస్థాయిలో గెలుపొందిన జట్లకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు.

నిరుపయోగంగా వైకుంఠధామాలు

- వినియోగంలోకి తేవాలని వినతి

ఇల్లంతకుంట, మే 20: గ్రామాలలో అంతిమ సంస్కారాలకు ఇబ్బంది అవుతోందని గుర్తించిన గత ప్రభుత్వం ఉపాధిహామీ నిధుల ద్వారా వైకుంఠధామాలు నిర్మించాలని ఆదేశాలు జారీ చేసింది. మండలంలో 33 గ్రామ పంచాయతీలు ఉండగా 32గ్రామాలలో వైకుంఠధామాలు పూర్తయ్యాయి. గొల్లపల్లి గ్రామంలో అసంపూర్తిగా ఉంది. ప్రతీ గ్రామంలో నిర్మించే వైకుంఠధామానికి తొలుత రూ.8 లక్షలు కేటాయించారు. అనంతరం మొత్తాన్ని రూ.12 లక్షల వరకు పెంచారు. రేపాకలో వైకుంఠధామానికి స్థలం లేకపోవడంతో గ్రామానికి చెందిన వ్యక్తి తన పట్టా భూమిని ఇచ్చాడు. ఇక్కడ వైకుంఠధామం నిర్మించగా గ్రామానికి దూరంగా ఉండడంతో అంతదూరం వెళ్లి అంత్యక్రియలు నిర్వహించడానికి ఆసక్తి కనబర్చడం లేదు. ఇల్లంతకుంటలో వైకుంఠధామం బిక్కవాగు సమీపంలో నిర్మించారు. ఇది సరైన స్థలమైనా నీటి సౌకర్యం లేకపోవడం, ఇతర కారణాలతో పిచ్చిమొక్కలు పెరిగాయి. మండల కేంద్రానికి చెందిన వారందరూ బిక్కవాగులోనే దహన సంస్కారాలు చేస్తుండడంతో వర్షకాలంలో వాగు ప్రవహించినప్పుడు ఈ నీటిని తాగిన పశువులు అనారోగ్యానికి గురవుతున్నాయని సమీప రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి వైకుంఠధామాలలో వసతులు కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఇల్లంతకుంటలోని వైకుంఠధామం

గ్రీవెన్స్ డేతో బాధితులకు సత్వర న్యాయం



ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, మే 19: బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 16 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఫిర్యాదుపై స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. భూ, ఆస్తి తగాదాల విషయంలో నిబంధనలకు అనుగుణంగా న్యాయం చేయాలని ఆదేశించామన్నారు.

వైభవంగా ధ్వజారోహణం



ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

వేములవాడ టౌన్, మే 20 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి అనుబంధ ఆలయమైన నాంపల్లి లక్ష్మీనృసింహస్వామి పంచాహ్నిత వార్షిక బ్రహ్మోత్సవంలో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రామాచారి, విజయేంద్రచారి, సుదర్శనచారి నేతృత్వంలో ఉదయం పంచామృత అభిషేకం, ధ్వజారోహణం, బలిహరణ కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం అగ్ని ప్రతిష్ఠ, వేద పారాయణం చేశారు. మధ్యాహ్నం స్వామివారికి మంగళశాసన, తీర్థ ప్రసాద వితరణ చేసినట్లు తెలిపారు.

రైతులకు అందుబాటులో జీలుగు విత్తనాలు

కోనరావుపేట, మే 20 : రైతులకు సబ్సిడీపై జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి వెంకట రామమ్మ తెలిపారు. సోమవారం కోనరావుపేటలో మాట్లాడారు. కోనరావుపేట, కొలనూరు, నిజామాబాద్, మంగళపల్లి గ్రామాల్లో సబ్సిడీపై జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు భూమి పాసుబుక్, ఆధార్ కార్డు నెంబర్‌తో సంబంధిత వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

స్కిల్ ఇండియాలో విద్యార్థిని ప్రతిభ

వేములవాడ టౌన్, మే 20: వేములవాడ పట్టణంలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని నేరెళ్ల అశ్విని జాతీయ స్థాయిలో స్కిల్ ఇండియాలో ప్రతిభ చాటినట్లు సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ పద్మజ ప్రకటనలో తెలిపారు. హోటల్ రిసెప్షన్ విభాగంలో బెంగళూరు, ఢిల్లీలో నిర్వహించిన ఇండియా స్కిల్స్ - 2024లో అశ్విని ప్రతిభను చాటిందని, నాలుగో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. మెడల్ ఆఫ్ ఎక్సెలెన్స్ అవార్డును దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్ పద్మజ, వైస్ ప్రిన్సిపాల్ శ్యామల, అధ్యాపకులు అభినందించారు.

ఈసెట్‌లో ఉత్తమ ర్యాంకులు

వేములవాడ టౌన్, మే 20 : బీటెక్ రెండో సంవత్సరంలోకి లారాల్ ఎంట్రీ ద్వారా ప్రవేశాల కోసం నిర్వహించిన తెలంగాణ ఈసెట్-2024 సంవత్సరం ప్రకటించిన ఫలితాలలో అగ్రహారం పాలిటెక్నిక్ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులను సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో పోతరవేని శివకుమార్ రాష్ట్ర స్థాయి 5వ ర్యాంకు, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ విభాగములో మనిసాయి రాష్ట్రస్థాయి 16వ ర్యాంకు, గోపికృష్ణ 17వ ర్యాంకు, సివిల్ విభాగంలో రాజ్‌కుమార్ రాష్ట్రస్థాయి 34వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు.

సీతారాముల కల్యాణోత్సవం

చందుర్తి, మే 20: మండలంలోని తిమ్మాపూర్ హనుమాన్ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం సీతారాముల కల్యాణాన్ని గ్రామస్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు పోతురాజు నగేష్, ఎడ్ల కిషన్, గాలిపెల్లి కాశయ్య, నల్లపు దివాకర్, ఎడ్ల వెంకటేశం, కాపిల్ల నరేష్,ఎడ్ల మల్లేశం, కాపిల్ల శంకర్, ఎడ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎల్లమ్మ కల్యాణోత్సవం

వేములవాడ టౌన్, మే 20: వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలో బుధవారం వరకు రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు గౌడ కులస్థులు తెలిపారు. సిద్దోగంలో భాగంగా సోమవారం గౌడ కులస్థులు జోగు కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం సాయంత్రం పోచమ్మ బోనాలు, బుధవారం రేణుకా ఎల్లమ్మ జమదగ్ని కల్యాణ మహోత్సవం, బోనాల జాతర ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

చందుర్తి, మే 20 : మల్యాలలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బంటు ఆనంద్ కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు, గ్రామ యువకులు వేర్వేరుగా సోమవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్లిన మల్యాలకు చెందిన కార్మికులు రూ.15వేలు పంపించగా అందజేశారు. కాంగ్రెస్ నాయకులు మ్యాకల పరశురాం, సంటి ప్రసాద్, ఈసరి శ్రీనివాస్, మ్యాదరి మనోహర్, ప్రసాద్, వికాస్, గొంటి మహేష్, మల్యాల యువకులు మాందాల అబ్రహం, ముదాం బాబు, లోకోజి సతీష్, నందు, వినీత్, గంగాధర్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బీరప్ప కామరాతి కల్యాణోత్సవం

చందుర్తి, మే 20 : మండలంలోని రామారావుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్ప ఆలయంలో కామరాతి సమేత బీరప్ప కామరాతి కల్యాణ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. బియ్యం సుంకు, డోలు చప్పుళ్లు, ఒగ్గు కళాకారుల విన్యాసాల మధ్య కురుమ కులస్తులు ఆలయానికి చేరుకున్నారు. ఆలయం ఆవరణలో పెద్ద పట్నం వేసి బీరప్ప కామరాతి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా మహిళలు బోనాలతో ఒగ్గు కళాకారుల విన్యాసాలు మధ్య ఆలయానికి తరలివచ్చారు. కల్యాణోత్సవానికి బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, జడ్పీటీసీ నాగం కుమార్ వేర్వేరుగా పార్టీ నాయకులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాల వితరణ, అన్నదాన కార్యక్రమం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మ్యాకల గణేష్, నాయకులు ముస్కు ముకుంద రెడ్డి, ముస్కు, శ్రీనివాస్ రెడ్డి, ఈర్లపల్లి రాజు, కమలాకర్ రావు, ఆనందం, తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో చల్మెడ లక్ష్మీనరసింహారావు

ఆరుబయట ఆభరణాలతో నిండ్రిచవద్దు

రుద్రంగి, మే 20: ఆరుబయట నిద్రించేటప్పుడు మహిళలు ఆభరణాలు వేసుకొని నిద్రించవద్దని, రాత్రి సమయంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉంటుందని చందుర్తి సర్కిల్ సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు సోమవారం రాత్రి రుద్రంగి మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో 'పోలీస్ మీకోసం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా బాధితులు సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని అన్నారు. ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. యువకులు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని, ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నప్పుడు వెంటనే సీఈఐఆర్ అప్లికేషన్‌ను సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సిరిసిల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

వేములవాడలో భక్తుల రద్దీ



భక్తులతో కిటకిటలాడుతున్న రాజన్న క్షేత్రం



క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు



గుడిచెరువు పార్కింగ్ స్థలంలో వాహనాలు

వేములవాడ టౌన్, మే 20:వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రం సోమవారం భక్తులతో రద్దీగా మారింది. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు స్వామివారిని దర్శించుకొని తరించారు. భారీ సంఖ్యలో భక్తులు రాజన్న ఆలయానికి తరలిరావడంతో అభిషేకపూజలను రద్దు చేశారు. కోడెమొక్కు చెల్లించుకునే భక్తులు కోడెటి కెట్ క్యూలైన్‌లో సుమారు నాలుగు గంటలపాటు నిరీక్షించారు. 50వేల మందికిపైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు వాహనాలతో ఆలయ గుడిచెరువు పార్కింగ్ స్థలం కిటకిటలాడింది.

విద్యుత్ తీగలు తెగిపడి రెండు గేదెలు మృతి

సుల్తానాబాద్, మే 20: మండలంలోని సుద్దాల గ్రామంలో సోమవారం రెండు పాడి గేదెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. గ్రామానికి చెందిన ఒజ్జ సదయ్య అనే రైతుతో పాటు దూడం రాములు అనే రైతుకు చెందిన పాడి గేదెలు మేతకు వెళుతుండగా మార్గమధ్యలో తెగిపడిన విద్యుత్‌తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయని రైతులు తెలిపారు. తమకు తగిన నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వెలవెలబోతున్న గోదావరి

● మరమ్మతుల కోసం సుందిళ్ల బ్యారేజీ ఖాళీ

కోల్‌సిటీ, మే 20: గలగల పారే గోదావరి వెలవెలబోతోంది.ఐదేళ్లుగా నిండుకుండలా ఉన్న గోదావరిలో ఇప్పుడు మడుగులు దర్శనమిస్తున్నాయి. రెండేళ్ల భారీ వరదలకు ఉన్న ఇసుక కొట్టుకపోయి రాళ్లు తేలాయి... అక్కడక్కడ లోతైన గుంతల్లో మాత్రమే నీరు మిగిలింది. మరమ్మతుల కోసం ఈ నెల 18న సుందిళ్ల బ్యారేజీలో నుంచి 0.7 టీఎంసీల నీటిని దిగువకు వదిలారు. ప్రీ మాన్‌సూన్ ఆపరేషన్స్, మెయింటనెన్స్ పనులు నిర్వహించనున్నారు. ఇందు కోసం బ్యారేజీలోని నీటిని దిగువకు వదిలారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు దిగువన గోదావరిలో ప్రవాహం లేదు. ఎన్టీపీసీ, రామగుండం ప్రాంతాలకు చెందిన డ్రైనేజీ నీరే ప్రస్తుతం గోదావరిలో కలుస్తుంది. గోదావరిలో ఏర్పడిన మడుగుల్లోని నీటిలోనే భక్తులు పుణ్య స్నానాలు చేస్తున్నారు. గోదావరిఖని పుష్కర ఘాట్ నుంచి ఇసుకలో నడిచి వెళ్లి పుణ్యస్నానాలు చేయడం పరిస్థితి ఏర్పడింది.

● సింగరేణికి గోదావరే దిక్కు...

గోదావరిలో నీరు తగ్గిపోవడంతో దీని ప్రభావం సింగరేణి మంచినీటి సరఫరాపై పడనున్నది. గోదావరినదిలోని ఇన్‌ఫిల్టరేషన్ గ్యాలరీ ద్వారా సింగరేణి కాలనీల అవసరాలకు ప్రతి రోజూ 23 నుంచి 25 ఎంఎల్‌డీల నీటిని పంపింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం సాండ్ బెడ్‌లో ఉన్న నీటినే సింగరేణి వాడుకోవాల్సి వస్తోంది. మరో పది రోజుల్లో వర్షాలు కురవకపోతే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.



గోదావరిలో తగ్గిన నీరు

తప్పుడు డాక్యుమెంట్స్‌తో భూమి అమ్మకం : ఇద్దరి అరెస్టు

చొప్పదండి, మే 20: చొప్పదండి పట్టణంలోని సర్వే నంబరు 301లో తప్పుడు డాక్యుమెంట్లతో భూమిని అమ్మిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ ఉపేంద్రాచారి తెలిపారు. 301 సర్వే నంబర్‌లో గుర్రం రాంరెడ్డి అనే వ్యక్తికి 65 గుంటల భూమి ఉంది. ఈ భూమిని రాంరెడ్డి 2010లో మునిపట్ల దేవేందర్‌రెడ్డి, అన్నాడి శ్రీకాంత్‌రెడ్డికి రిజిస్ట్రేషన్ చేశాడు. తన వాటాగా వచ్చిన 32 గుంటల భూమిని మునిపట్ల దేవేందర్‌రెడ్డి చొప్పదండికి చెందిన కొత్తూరు ఆంజనేయులు, సుద్దాల వెంకటస్వామికి 2019 సంవత్సరంలో విక్రయ ఒప్పందం, జీపీఏ చేశాడు. అదే భూమిలోని ఆరు గుంట భూమిని సుద్దాల వెంకటస్వామి, కొత్తూరు ఆంజనేయులు ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్‌కు చెందిన చిలుక బాలామణి, కళ్లెం అంజిరెడ్డికి విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారు. అనంతరం అదే భూమిని పాత జీపీఏ డాక్యుమెంట్లు చూపించి కరీంనగర్‌కు చెందిన వైద్యుల మహేందర్ రెడ్డి వద్ద ఎనిమిది లక్షల రూపాయలు తీసుకుని అమ్మారు. రిజిస్ట్రేషన్ చేసి మోకా ఇప్పిస్తామని చాలా రోజుల నుంచి తప్పించుకుంటున్నారు. భూమి చూపెట్టమని అడిగితే అంతు చూస్తామని బెదిరించారు. దీంతో వైద్యుల మహేందర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, విచారణ అనంతరం సోమవారం సుద్దాల వెంకటస్వామి, కొత్తూరు ఆంజనేయులును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకున్న రైతులు

రామడుగు, మే 20: మండలంలోని దేశ్‌రాజ్‌పల్లి ఊర చెరువులో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను గ్రామ రైతులు సోమవారం అడ్డుకున్నారు. ఊర చెరువులో రాత్రి పగలు అనే తేడా లేకుండా టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించడంతో సమీప బావులలో భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తపల్లి-మనోహరబాద్ రైల్వే నిర్మాణ పనులకు చెరువులోని మట్టిని తీయడానికి అనుమతులు తీసుకున్నట్లు సదరు కాంట్రాక్టర్ బెదిరిస్తున్నాడని రైతులు ఆరోపిస్తున్నారు. గత కొంత కాలంగా మట్టి తరలిస్తున్న సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారని, ఇప్పటికైనా అక్రమ మట్టి తరలింపును నిలిపివేయాలని రైతులు కోరుతున్నారు.

బీపీఎంపై కేసు నమోదు

గొల్లపల్లి, మే 20: మండలంలోని చిల్వాకోడూర్ తపాల శాఖలో ఖాతాదారులకు సంబంధించిన 11.60 లక్షల రూపాయలు స్వాహా చేసిన బీపీఎం దూడ నల్ల పోచయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిర్ర సతీష్ కుమార్ సోమవారం తెలిపారు. చిల్వాకోడూర్ బీపీఎంగా విధులు నిర్వహిస్తున్న నల్ల పోచయ్య తపాల శాఖలో అమలు చేస్తున్న వివిధ పథకాల్లో ఖాతాదారులు తమ డబ్బులను పొదుపు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, మధ్య తరగతి ప్రజలు తపాల శాఖలో పొదుపు చేసుకుంటున్నారు. బీపీఎం ఖాతాదారుల నుంచి తీసుకున్న సొమ్మును వారి వారి ఖాతాల్లో జమ చేయకుండా సొంతానికి వాడుకున్నట్లు ఇటీవల వెలుగు చూసింది. బాధితులు గొల్లపల్లిలోని తపాల శాఖ అధికారికి ఫిర్యాదు చేయగా, విచారించిన అధికారులు ఖాతాదారుల డబ్బును స్వాహా చేసినట్లు తేలింది జగిత్యాల సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరిండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ జి వేణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీపీఎం పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం : ఒకరి అరెస్టు

ఇల్లంతకుంట, మే 20: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని యువకులను మోసం చేసిన సిరిసిల్ల పట్టణానికి చెందిన కారునాథం శివకృష్ణను సోమవారం అరెస్టు చేసినట్లు సిరిసిల్ల ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నర్సక్కపేట గ్రామానికి చెందిన ర్యాగటి మల్లయ్య ఇదే గ్రామానికి చెందిన కొత్త లింగారెడ్డి, బోల్ల రాము, తిప్పరవేని చంద్రశేఖర్, దారం శ్రీనివాస్‌రెడ్డికి శివకృష్ణను పరిచయం చేశారు. పంచాయతీ కార్యదర్శులు, సింగరేణి ఉద్యోగాలు ఇప్పిస్తానని శివకృష్ణ వారివద్ద నుంచి 6.50 లక్షల రూపాయలు వసూలు చేశాడు. బాదితుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి సోమవారం ఇల్లంతకుంట బస్టాండులో అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌చార్జి డీఎస్పీ తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటే యువకులు నమ్మిమోసపోవద్దని ఆయన అన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కోనరావుపేట, మే 20: కోనరావుపేట మండలం కొలనూరు గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం గంగాధర మండలం రంగారావుపల్లి గ్రామానికి చెందిన సందెవేణి రేణుక (23) కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామంలో తన అమ్మమ్మ ఇంటికి వచ్చి ఆదివారం రాత్రి తిరిగి ఆటోలో బయలుదేరింది. కొలనూరు గ్రామంలో ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని ఆటో ఢీకొన్న ఘటనలో రేణుకకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. రేణుక సోదరుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపు తప్పిన ఇసుక లారీ

రామగిరి, మే 20: మండలంలోని నాగేపల్లి ఆంధ్రాబ్యాంక్ సమీపంలో అదుపు తప్పిన ఇసుక లారీ కారును ఢీ కొట్టి రోడ్డు పక్కన ఉన్న ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. మంథని- పెద్దపల్లి ప్రధాన రహదారి నాగేపల్లి ఆంధ్రాబ్యాంక్ సమీపంలో సోమవారం ఓ లారీ వేగంగా వస్తూ అదుపు తప్పింది. బ్యాంక్ ఎదుట నిలిపి ఉంచిన ఓ కారును ఢీకొంది. అనంతరం రోడ్డు పక్కన ఉన్న ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. లారీ డ్రైవర్ అజాగ్రత్త, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్లే ఈ ఘటన జరిగిందని స్థానికులు అన్నారు.

జేఎన్టీయూ కళాశాలలకు కొత్త ప్రిన్సిపాల్స్

ఉత్తర్వులు జారీచేసిన యూనివర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు

హైదరాబాద్ సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకు అనుబంధంగా ఉన్న రెండు ఇంజనీరింగ్ కళాశాలలకు కొత్త ప్రిన్సిపాల్స్‌ను నియమిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జేఎన్‌టీయూ జగిత్యాల వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌ను సిరిసిల్ల జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు. అక్కడ ప్రిన్సిపాల్‌గా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ప్రొఫెసర్ చంద్రమోహన్‌ను హైదరాబాద్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగానికి తీసుకువచ్చారు.

మరోవైపు జగిత్యాల జేఎన్‌టీయూ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఈసీఈ ప్రొఫెసర్ ప్రభాకర్‌ను అదే కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమించారు. తాజా ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని రిజిస్ట్రార్ స్పష్టం చేశారు.

గంభీరావుపేటలో సైబర్ మోసం

● రైతుల బ్యాంక్ ఖాతాల నుంచి రూ.3 లక్షల 24 వేలు స్వాహా ● వాట్సాప్‌లో ఫేక్ లింక్ మెసేజ్‌లు

గంభీరావుపేట, మే 20: గంభీరావుపేట మండలంలో పలువురు సైబర్ మోసానికి బలయ్యారు. సైబర్ నేరగాళ్లు వాట్సాప్‌ల్లో ఫేక్ లింక్‌ల మెసేజ్‌లు పంపుతూ బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు స్వాహా చేస్తున్నారు. నాలుగు రోజుల వ్యవధిలో రూ. 3 లక్షల 24 వేల 900 వేలు సైబర్ నేరగాళ్లు కొట్టేయడంతో బాధితులు లబోదిబో మంటున్నారు. మోసపోయిన నలుగురు బాధితులు రైతులే కావడం గమనార్హం. గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన కోటయ్యగారి రాజేందర్‌రెడ్డి నుంచి రూ. 45 వేలు, దండు నరేష్ ఖాతా నుండి రూ. 44 వేల 900, లంగారెడ్డిగారి రాజశేఖర్‌రెడ్డి ఖాతా నుండి 50 వేలు, కోటయ్యగారి లత ఖాతా నుంచి రూ 1 లక్షా 85 వేలు చొప్పున వారి బ్యాంక్ ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్లు లూటీ చేశారు. రైతులు వరి ధాన్యం అమ్మిన డబ్బులు ఇటీవల యూనియన్ బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయి. డబ్బులు జమ అయిన కొద్ది రోజుల్లోనే వీరి ఖాతాల నుంచి డబ్బులు పోయినట్టు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో నలుగురు బాధితులు బ్యాంక్ వద్దకు పరుగులు తీశారు. ఫేక్ లింక్‌ల మెసేజ్‌ను ఓపెన్ చేయడం వల్లే బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు లూటీ అయినట్టు బ్యాంక్ అధికారులు బాధితులకు చెప్పారు. దీంతో వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి బాధితులు ఫిర్యాదు చేశారు. సైబర్ నేరగాళ్లు ఏపీకే పేరిట పంపిన ఫేక్ లింక్‌ను ఓపెన్ చేయడం వల్లే డబ్బులు స్వాహా అయ్యాయని పోలీస్‌లు గుర్తించారు. ఆ ఫేక్ లింక్ క్లిక్ చేసిన వెంటనే సెల్‌ఫోన్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లి, ఓటీపీ ద్వారా డబ్బులను కొట్టేస్తున్నట్టు పోలీస్‌లు నిర్ధారించారు. ఆరుగాలం శ్రమించిన వరి ధాన్యం డబ్బులు సైబర్ నేరగాళ్ల పరం కావడంతో రైతు కుటుంబాలను తీవ్రంగా బాధించింది. పోయిన మా డబ్బులు తిరిగి వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. సెల్‌ఫోన్‌లో వచ్చే ఫేక్ లింక్ మెసేజ్‌లను ఓపెన్ చేయవద్దని ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు, పోలీస్‌లు ప్రజలకు సూచించారు.


డబ్బులు పోయాయని ఆవేదనతో ఉన్న రైతులు

టిప్పర్ ఢీకొని ఒకరి మృతి

శంకరపట్నం, మే 20: శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో టిప్పర్ ఢీకొని ఒకరు మృతిచెందారు. పోలీసులు.. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మానకొండూర్ మండల కేంద్రానికి చెందిన పర్వతం ఎల్లయ్య (51) శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన తన కూతురు ఊర పద్మ ఇంట్లో రెండు నెలలుగా ఉంటూ చిరు వ్యాపారాలు చేసుకుంటున్నాడు. సోమవారం వ్యక్తిగత పనిపై బయటికి వెళ్లాడు. తాడికల్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్దకు రాగానే జాతీయ రహదారి 563 నిర్మాణ సంస్థ బుల్డ్‌కాస్‌కు చెందిన ఓ టిప్పర్ హుజూరాబాద్ వైపు వెళ్తూ వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టిప్పర్ టైర్ ఎల్లయ్యపై నుంచి వెళ్లగా తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. టిప్పర్ డ్రైవర్ ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన సునీల్‌రాం పారిపోతుండగా స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. సంఘటన స్థలానికి ఎస్‌ఐ పాకాల లక్ష్మారెడ్డి సిబ్బందితో చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు, ఓ కూతురు ఉన్నారు. ఇంట్లో నుంచి బయటకు వచ్చిన 5నిమిషాలకే ప్రమాదం రూపంలో మృత్యువు కబలించడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడి కొడుకు పర్వతం నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపారు. న్యాయం చేయాలని మృతుడి కుటుంబీకులు రాస్తారోకో చేయగా హుజూరాబాద్ టౌన్ సీఐ రమేష్‌తో పాటు సైదాపూర్ ఎస్‌ఐ ఆరోగ్యం, అదనపు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తర్వాత మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టంకు తరలించారు.

టిప్పర్లే మృత్యు శకటాలు

● తాడికల్‌లో ఐదు రోజుల వ్యవధిలో ఇద్దరి మృతి

శంకరపట్నం : శంకరపట్నం మండలంలో రహదారి నిర్మాణ సంస్థ టిప్పర్లు ప్రజల ప్రాణాలు పొట్టన పెట్టుకుంటున్నాయి. కరీంనగర్-వరంగల్ రహదారిపై ఐదు రోజుల వ్యవధిలోనే తాడికల్‌లో రహదారి నిర్మాణ సంస్థ టిప్పర్లు ఢీకొని ఇద్దరు మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. గత బుధవారం ఆయిల్ ట్యాంకర్ ప్రజలపై దూసుకు వచ్చిన ఘటనలో ఒకరు మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. కాగా సోమవారం బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గతంలో పలు యాక్సిడెంట్లకు కారణమయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రహదారి వెంట ప్రయాణించాలంటే ప్రాణాలు అరిచేతులో పెట్టుకొని రావాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. డ్రైవర్ల అధిక వేగం, భారీ వాహనాలు, ఓవర్‌లోడ్, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సరైన చర్యలు చేపట్టి ఇక మీదట రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఏసీబీకి చిక్కిన సీనియర్ అసిస్టెంట్

● రూ.7 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

సిరిసిల్ల క్రైం మే 20: రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జోగినిపల్లి భాస్కర్‌రావు సోమవారం ఏసీబీకి చిక్కాడు. కాంట్రాక్టర్ వద్ద రూ.7 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. బాధితుడి వివరాల ప్రకారం.. జిల్లాలోని గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన కాంట్రాక్టర్ వెంకటేశం అదే గ్రామంలో ఖబ్రస్థాన్ ప్రహరీ నిర్మాణం చేపట్టాడు. రూ.4.35 లక్షలతో నిర్మించిన ఖబ్రస్థాన్ ప్రహరీ బిల్లు ఫైల్‌ను చీఫ్ ప్లానింగ్ అధికారికి పంపేందుకు సీనియర్ అసిస్టెంట్ జోగినిపల్లి భాస్కర్‌రావును కలిశాడు. నాలుగు నెలలుగా తిప్పుకుంటున్న భాస్కర్‌రావు రూ.8 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో కాంట్రాక్టర్ వెంకటేశం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. నాలుగు రోజులుగా వలపన్నిన ఏసీబీ అధికారులు సోమవారం పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో వెంకటేశం నుంచి రూ.7వేలు లంచం తీసుకుంటుండగా భాస్కర్‌రావును పట్టుకున్నారు. ఈ విషయమై ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి మాట్లాడుతూ కాంట్రాక్టర్ వెంకటేశం వద్ద రూ.7 వేలు లంచం తీసుకుంటుండగా సీనియర్ అసిస్టెంట్ భాస్కర్‌రావును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు చెప్పారు. ఈ బిల్లుకు సంబంధించిన ఫైల్స్‌తోపాటు పట్టుబడిన సీనియర్ అసిస్టెంట్‌ను కరీంనగర్ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరుస్తామని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఏ అధికారైనా లంచం డిమాండ్ చేస్తే ఫోన్ : 9154388954 సమాచారం అందించాలని, వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. దాడుల్లో ఏసీబీ సీఐలు కృష్ణకుమార్, తిరుపతి, ఎస్‌ఐలు పాల్గొన్నారు.


బాధితుడు జి. వెంకటేశ్


ఏసీబీకి పట్టుబడ్డ సీనియర్ అసిస్టెంట్ భాస్కర్‌రావు

గూడెం వద్ద గోదావరిలో మునిగి యువకుడి మృతి

దండేపల్లి,మే 20: హనుమాన్ మాలధారణ స్వీకరించేందుకు వచ్చిన యువకుడు గోదావరి నదిలో మునిగి మృతి చెందిన సంఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం గోదావరి వద్ద సోమవారం చోటుచేసుకుంది. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామానికి చెందిన దుర్గం కీర్తన్‌గౌడ్ అలియాస్ రిషీ (19) అతని స్నేహితులు కోడూరి శేఖర్, గర్రెపల్లి వినయ్, వెగ్గలం అజయ్, దూలం మురళి, కొమ్మ సాయితో కలిసి హనుమాన్ దీక్ష స్వీకరించేందుకు గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలోని అనుబంధ హనుమాన్ ఆలయానికి వచ్చారు. దీక్షకు ముందు స్నానం చేసేందుకు స్నేహితులతో కలిసి గోదావరి నదిలో దిగారు. కీర్తన్‌గౌడ్‌కు ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు కేకలు వేయడంతో జాలర్లు గాలింపు చర్యలు చేపట్టగా అప్పటికే కీర్తన్‌గౌడ్ మృతి చెందాడు. మృతదేహాన్ని లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కీర్తన్‌గౌడ్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మృతుడి తండ్రి దుర్గం తిరుపతిగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భూమేష్ తెలిపారు.


కీర్తన్‌గౌడ్(ఫైల్)

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి ఆర్వీ కర్ణన్


మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి ఆర్వీ కర్ణన్

కరీంనగర్ టౌన్, మే 20:ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి ఆర్వీ కర్ణన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లాలోని అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు ధాన్యం కొనుగోలు వంద శాతం పూర్తి చేయాలన్నారు. వర్షం వల్ల మొలకెత్తిన, తడిసిన ధాన్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాంటి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్‌కు ఉపయోగించేలా చూడాలన్నారు. ఈ మేరకు రైస్‌మిల్లర్లకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తూ రైతులకు సత్వరమే డబ్బులు అందేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. అనంతరం కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్, తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల సిరిసిల్ల అదనపు కలెక్టర్లు లక్ష్మికిరణ్, శ్యాంప్రసాద్‌లాల్, రాంబాబు, బీమానాయక్, పౌర సపరఫరాల జిల్లా మేనేజర్ రజనీకాంత్, మార్కెటింగ్ అధికారి పద్మావతి, డిఆర్‌డిఓ శ్రీధర్ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

సుల్తానాబాద్, మే 20: అకాల వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేకాధికారి, వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర సంచాలకులు ఆర్ వి కర్ణన్ అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రంను సోమవారం జిల్లా ప్రత్యేకాధికారి కర్ణన్ పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్‌తో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కర్ణన్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్న రైతులతో మాట్లాడారు. వారి నుంచి కొనుగోళ్ల ప్రక్రియ గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో నిర్దేశించిన లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉంటూ రైతుల వద్ద నుంచి మద్దతు ధరపై కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.


గర్రెపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కర్ణణ్

నక్కను రక్షించిన ఫారెస్టు అధికారులు

శంకరపట్నం, మే 20: వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడిన నక్కను ఫారెస్టు అధికారులు బయటకు తీసి ప్రాణాలు కాపాడారు. సోమవారం మండలంలోని మొలంగూర్ గ్రామ శివారులో ముప్పిడి విజేందర్‌రెడ్డి వ్యవసాయ బావిలో నక్క పడిందని సమాచారం తెలుసుకున్న ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్, బీటీ ఆఫీసర్ తక్షణమే అక్కడికి చేరుకొని బావి నుంచి నక్కను బయటకు తీసి ప్రాణాపాయం నుంచి కాపాడారు.


బావినుంచి బయటకు తీసిన నక్క

జంట హత్య కేసులో నిందితుల అరెస్ట్

● వివరాలు వెల్లడించిన జగిత్యాల డీఎస్పీ

ధర్మపురి, మే 20: బుగ్గారం మండలంలోని గోపులాపూర్‌లో దీటి శ్రీనివాస్, దీటి మహేష్‌లను హత్యచేసిన కేసులో ఏడుగురు నిందితులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. ధర్మపురి పోలీస్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ సోమవారం ధర్మపురి సీఐ ఏ. రాంనర్సింహారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను అరెస్ట్ చేసి చూపించి హత్య వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గోపులాపూర్ గ్రామంలో దీటి తార, ఆమె కొడుకు దీటి శ్రీనివాస్ 2018లో నాగుల అంజయ్య వద్ద ఇంటిని కొన్నారు. అదే ఇంటిని 2017లో అంజయ్య తమకు విక్రయించాడని తార ఇంటి పక్కనే ఉన్న బుర్ర లక్ష్మి ఆమె కొడుకులు నాగరాజు, నవీన్ కోర్టును ఆశ్రయించారు. 2023లో కోర్టు సివిల్ కేసును కొట్టివేసింది. అప్పటి నుంచి రెండు కుటుంబాల మధ్య విభేదాలు ఉన్నాయి. ఈ నెల 16న రాత్రి తార, కొడుకు శ్రీనివాస్, దీటి మహేష్, నవీన్ కుటుంబ సభ్యులకు గొడవ జరిగింది. దీంతో శ్రీనివాస్‌ను అతడికి సహకరిస్తున్న మహేష్‌ను ఎలాగైనా చంపాలని నవీన్ అనుకున్నాడు. అదే రోజు రాత్రి నవీన్ స్నేహితులు పవన్, రాజేందర్, వెంకటేష్, గంగారాజం అలియాస్ మనోజ్, శేషు, అజయ్‌లతో కలిసి శ్రీనివాస్, మహేష్‌లపై ఇనుప పైపులు, కర్రలతో విచక్షణారహితంగా కొట్టి అక్కడి నుంచి నిందితులు పరారయ్యారు. ఈ ఘటనలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందగా మహేష్ వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుగ్గారం ఎక్స్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నిందితులను పట్టుకుని వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన ఇనుప పైపులు, కర్రలు, ఒక కారు, రెండు మోటార్ సైకిళ్లు, ఏడు సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. సంఘటనకు కారణమైన బుర్ర లక్ష్మి, నాగరాజు, వెంకటమ్మ, పూజలపై కూడ చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ధర్మపురి సీఐ ఏ. రాంనర్సింహారెడ్డి, ఎస్‌ఐలు శ్రీధర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, సతీష్, ఉమాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్


పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులు

వైభవంగా లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం


కొండస్వామి ఆలయంలో కల్యాణం

మెట్‌పల్లి రూరల్, మే, 20: మండలంలోని జగ్గసాగర్ గ్రామ శివారులోని కొండ స్వామి ఆలయంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిపించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలో వేదపండితుడు చక్రపాణి మాధవచార్యుల ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, స్వామి వారికి అభిషేకం, ధ్వజారోహనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణానికి గ్రామ పంచాయతీ నుంచి పుస్తె, మట్టెలను ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ స్థులు డప్పు చప్పుళ్ల మధ్య శోభాయాత్రగా ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం పురోహితుల వేదమంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా స్వామి వారి కల్యాణం జరిపారు. స్వామి వారిని భక్తులు దర్శించుకుని తరించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, గ్రామాభివృద్ధి, ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు, పాల్గొన్నారు.

ధర్మపురిలో వైభవంగా నృసింహ నవరాత్రోత్సవాలు

ధర్మపురి, మే 20: నరసింహ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో అన్నకూటోత్సవం కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. నవరాత్రోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితర వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, వ్యాస పూర్వక, శోడషోపచార పూజ, సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. పంచోపనిషత్తులచే మన్యసూక్త, రుద్రాభిషేకం, విశేష పూజలు, సప్త హారతులు, తులసీ అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. అన్నకూటోత్సవంలో భాగంగా ఉదయం పలు రకాల ప్రసాదాలతో మహా నివేదన, సప్త హారతులు, భజనా కార్యక్రమాలు నిర్వహిం చారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి వారలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


తులసీ దండలతో స్వామివారల అలంకరణ

రేషన్ బియ్యం తరలిస్తున్న రెండు ట్రాలీల పట్టివేత


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

కోల్‌సిటీ, మే 20: గోదావరిఖని గంగానగర్‌లోని మిలీనియం క్వార్టర్స్ సమీపంలో ఆదివారం రాత్రి రేషన్ బియ్యం తరలిస్తున్న రెండు ట్రాలీలను గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. పీడీఎస్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు నిఘా పెట్టి పట్టుకున్నారు. టీఎస్03యూడీ0220 నంబర్ గల వాహనంలో 65బస్తాలు, టీఎస్22టీ8686 నంబర్ గల వాహనంలో 50బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనాలను సీజ్‌చేసి బేగంపేటకు చెందిన పోలుదాసరి సంతోష్, తూర్పాటి రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఇన్స్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

యారన్ సబ్సిడీ సమస్య పరిష్కరించాలి


సిరిసిల్ల చేనేత జౌళిశాఖ ఎదుట ధర్నా చేస్తున్న మరమగ్గాల కార్మికులు

సిరిసిల్ల రూరల్, మే 20: బతుకమ్మ చీరలను తయారు చేసిన మరమగ్గాల కార్మికులకు అందించే పదిశాతం యారన్ సబ్సిడీ సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని చేనేత జౌళిశాఖ కార్యాలయం ఎదుట సోమవారం యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మరమగ్గాల కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. చేనేత జౌళిశాఖ ఏడీ సాగర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర చేనేత జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి ఏకపక్ష నిర్ణయాలతో సిరిసిల్ల నేతన్నల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. 10 శాతం యారన్ సబ్సిడీ డబ్బులను తగ్గించకుండా వెంటనే అందించాలన్నారు. నేతన్నకు చేయూత (త్రిఫ్ట్) పథకానికి సంబంధించి ప్రభుత్వం నుంచి కార్మికులకు రావాల్సిన దాదాపు 10 నెలల పెండింగ్ డబ్బులను చెల్లించాలన్నారు. ఈ సమస్యను పరిష్కరించకుంటే ఈ నెల 24వ తేదీన సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో హైదరాబాద్‌లోని కమిషనరేట్‌ను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నక్క దేవదాస్, గుండురమేష్, కంది మల్లేశం, బెజుగం సురేష్, మూషం శంకర్, స్వర్గం శేఖర్, రవీందర్, పోచమల్లు, సదానందం, శ్రీనివాస్, రాజమౌళి, శ్రీధర్, నరేష్, దామోదర్, భాస్కర్, తిరుపతి, అశోక్, శేఖర్, విజయ్, సంపత్, శంకర్, రవి, వెంకటేష్, సత్యనారాయణ, రమేష్ సతీష్, లక్ష్మణ్, మల్లేశం, మనోహర్, కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

శాతవాహన యూనివర్సిటీ దోస్త్ టీం ఏర్పాటు : వీసీ

గణేశ్‌నగర్,మే 20: శాతవాహన యూనివర్సిటీ దోస్త్ టీంను మంగళవారం ఏర్పాటు చేయనున్నట్లు శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్.మల్లేష్ తెలిపారు. యూనివర్సిటీ కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ సూరపల్లి సుజాత- 9849468281,టెక్నికల్ అసిస్టెన్స్‌గా మార్క సంతోష్‌కుమార్-9030402257, గొల్లె మారుతి-98666 25885, సపోర్టింగ్ స్టాఫ్‌గా ప్రవీణ్‌లను నియమించారు. యూనివర్సిటీకి సంబంధించి దోస్త్ సేవలకు టీం పనిచేస్తుందని వీసీ తెలిపారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 20: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,350 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 11మంది రైతులు 125క్వింటాళ్ల విడి పత్తి, ముగ్గురు రైతులు ఐదు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ గరిష్ఠ ధర రూ.7350, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించారు.

ప్రమాదవశాత్తు ఇంటిలో మంటలు

● కాలిబూడిదైన రెండు లక్షల నగదు, ఆభరణాలు

సుల్తానాబాద్, మే 20: సుల్తానాబాద్ మండలంలోని నారాయణరావుపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు మంటల్లో రెండు లక్షల నగదు, బంగారు, వెండి ఆభరణాలు కాలి బూడిదయ్యాయి. గ్రామానికి చెందిన ఊర కొండయ్య కుటుంబం ఒకరి ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. సోమవారం నిత్యావసర సరుకులను తీసుకురావడం కోసం ఇంటికి తాళం వేసి కరీంనగర్ వెళ్లారు. ఇంట్లో మంటల చెలరేగి పొగలు రావడంతో గమనించిన స్థానికులు వెంటనే తాళం పగులకొట్టి లీకేజీ అయి ఉన్న గ్యాస్ సిలెండర్‌ను బయటకు విసిరేసి ప్రమాద తీవ్రతను తగ్గించారు. అప్పటికే ఇంట్లో ఉన్న మంచాలు బీరువా ఇతర సామాన్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఇంట్లో ఉన్న రెండు లక్షల నగదుతో పాటు వెండి బంగారు నగలు కూడా మంటల్లో కాలిపోయాయి. సంఘటన స్థలానికి కరీంనగర్ నుంచి అగ్నిమాపక దళ సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పి వేశారు. సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తన సిబ్బందితో వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు బాధిత కుటుంబానికి యాభై కిలోల బియ్యం తదితర నిత్యావసర సరుకులను బట్టలను అందించారు. కాగా అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టు బట్టలతో మిగిలి బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తాజా మాజీ సర్పంచ్ మొలుగూరి వెంకటలక్ష్మి, మాజీ ఎంపీటీసీ అంజయ్య తదితరులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.


కాలిపోయిన నోట్లను పరిశీలిస్తున్న భాదితుడు

పోలీసుల ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ వెంకటేశ్వర్లు

రుద్రంగి, మే 20: రుద్రంగి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని క్రీడా మైదానంలో పోలీసుల ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలను చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందన్నారు.ఎస్సై సిరిసిల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు దేహదారుఢ్యం పెంపొందుతుం దన్నారు. కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు పాల్గొన్నారు.

చందుర్తి: గ్రామీణ ప్రాంతంలోని యువత సన్మార్గంలో ప్రయాణించాలని చందుర్తి ఎస్ఐ శ్రీకాంత్ అన్నారు. చందుర్తి మండలం మల్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా ఎస్పీ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం వాలీబాల్, కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల వాలీబాల్, కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

●చందుర్తి మండల కేంద్రంలోని క్రికెట్, వాలీబాల్ క్రీడాకారులకు పురగిరి క్షత్రియ పెరిక సంఘం అధ్యక్షుడు మార్త మల్లేశం సోమవారం క్రీడా సామగ్రిని అందజేశారు. ఎస్పీ ఆధ్వర్యంలో చందుర్తి పోలీస్ శాఖ నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్, క్రికెట్ క్రీడల్లో చందుర్తి నుండి పాల్గొంటున్న వాలీబాల్, క్రికెట్ క్రీడాకారులకు టీ షర్ట్స్, బ్యాట్స్ క్రీడా సామాగ్రిని అందజేసినట్లు మల్లేశం తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కంచర్ల రవిగౌడ్

సిరిసిల్ల రూరల్, మే 20: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో తెలిపిన విధంగా విద్యార్థులకు హాస్టళ్లు, కళాశాలల్లో మౌలిక వసతులను కల్పించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా విద్యా వ్యవస్థను పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో నాయకులు మట్టి శ్రీనివాస్, ఓగ్గు అరవింద్, సామల శ్రీకాంత్, కోలాపురం అరవింద్, కోడం నరేష్, నడిమెట్ల సందీప్ పాల్గొన్నారు.

వేసవి శిబిరం.. క్రీడలకు ఊతం

- వాలీబాల్, కబడ్డీ, క్రికెట్‌లో శిక్షణ
- హాజరవుతున్న 80 మంది విద్యార్థులు
- ఉత్సాహంగా శిబిరాలు
- ఈ నెల చివరి వరకు కొనసాగింపు



వ్యాయామం చేస్తున్న విద్యార్థులు

ఇల్లంతకుంట, మే 20: వేసవి శిక్షణ శిబిరాలు క్రీడలకు ఊతమిస్తున్నాయి. పాఠశాలల్లో పుస్తకాలతో కుస్తీపట్టిన విద్యార్థులు పరీక్షల అనంతరం ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. గ్రామాల్లో రోజురోజుకు పెరుగుతున్న క్రీడల పట్ల ఆసక్తిని గమనించిన జిల్లా యువజన, క్రీడాశాఖ సౌజన్యంతో ఇల్లంతకుంటలో వాలీబాల్‌లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో శిబిరాన్ని ప్రారంభించారు. పలువురు విద్యార్థులు కబడ్డీ, క్రికెట్ నేర్చుకోవడానికి ఆసక్తి కనబర్చడంతో మూడు అంశాలలో ఉదయం, సాయంత్రం శిక్షణను అందిస్తున్నారు. వేసవి క్రీడాశిబిరానికి ప్రతీరోజు 80 మంది విద్యార్థులు హాజరై మెళకువలు నేర్చుకుంటున్నారు. మండలంలోని వల్లంపట్ల గ్రామంలోని విద్యార్థులకు కొంతమంది క్రీడలలో శిక్షణ ఇస్తున్నారు. మండలంలోని పలు గ్రామాలలోని క్రీడాకారులు ఇప్పటికే జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలలో రాణించడాన్ని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ముందుకెళ్తున్నారు.

ఈనెల చివరి వరకు శిక్షణ శిబిరం కొనసాగనుండగా, చివరి రోజున విద్యార్థులకు సర్టిఫికెట్లుతోపాటు జెర్సీలను అందించనున్నారు.

వాలీబాల్‌లో మెళకువలు నేర్చుకుంటున్నా

- కొయ్యడ మహేందర్, ఇల్లంతకుంట



మండలకేంద్రంలో కొనసాగుతున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరం ద్వారా వాలీబాల్‌లో మెళకువలు నేర్చుకుంటున్నా. పాఠశాలలో ఆడుకునే సమయం దొరికేది కాదు. ఉదయం, సాయంత్రం శిక్షణ తీసుకుంటున్నాను. క్రీడాకారులకు సమాజంలో మంచి గౌరవం లభిస్తుంది. ఆటలో చేసిన పొరపాట్లను అనంతరం ట్రైనర్ వివరిస్తున్నారు. మరోసారి తప్పు జరగడం లేదు.

ఆటల ప్రాధాన్యం గుర్తిస్తున్న విద్యార్థులు

- సాన బాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు



విద్యార్థులు ఆటలకు ఉండే ప్రాధాన్యం గుర్తిస్తున్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరానికి 80 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. ఆటల్లో మెళకువలు నేర్చుకుంటున్నారు. తొలుత కొంత సమయం వ్యాయామం చేస్తున్నారు. అనంతరం ఆటల్లో పాల్గొంటున్నారు. విద్యార్థులు చేసిన తప్పిదాలను గుర్తించి వారికి వివరిస్తున్నాం. దీని ద్వారా క్రీడల్లో మరింత రాణిస్తారు.

యువత ఉపాధిపై దృష్టి సారించాలి



అవగాహన కల్పిస్తున్న మిత్ర ఫౌండేషన్ నిర్వాహకులు

కోనరావుపేట, మే 20: యువతఉపాధి మార్గాలను ఎంచుకోవాలని కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు సూచించారు. కోనరావుపేట మండలం ఎగ్లాస్‌పూర్‌లో సోమవారం వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి ఆదేశాల మేరకు మిత్ర ఫౌండేషన్ ఇంద్రారెడ్డి రామచంద్రయ్య ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించామన్నారు. వ్యవసాయంతోపాటు తేనెటీగల పెంపకంపై పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కోనరావుపేట ఏఎస్సై శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

గృహ నిర్మాణదారుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న గృహ నిర్మాణదారులు

కోనరావుపేట, మే 20: కోనరావుపేట మండల కేంద్రంలోని తహరసీల్దార్ కార్యాలయం ఎదుట గృహ నిర్మాణ దారులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహ నిర్మాణం దారుడు శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ఇసుక లేక ఇళ్ల నిర్మాణం నిలిచిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణానికి ఇసుక అనుమతి తీసుకున్నా మూలవాగు గ్రామస్థులు ఒప్పుకోవడం లేదన్నారు. గ్రామస్థులతో మాట్లాడి ఇసుకను తరలించడానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా గుట్ట మల్లికార్జునస్వామి కల్యాణం

గంభీరావుపేట, మే 20 : గంభీరావుపేట మండలం కొత్తపల్లి సమీపాన ఉన్న గుట్ట మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో గుట్ట మల్లికార్జునస్వామి ఉత్సవాలు 19 నుంచి ప్రారంభమయ్యాయి. 22 వరకు కొనసాగనున్నాయి. సోమవారం మల్లన్న పట్నాలు, మేడలమ్మ కేతమ్మ మల్లన్న కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక యాదవ సంఘం నాయకులు, పలువురు నాయకులు, ప్రజలు దర్శించుకున్నారు.

సుద్దాలలో బీరప్ప ఉత్సవాలు

కోనరావుపేట, మే 20: కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో యాదవుల కులదైవమైన బీరప్ప ఉత్సవాల్లో బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు సోమవారం పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు,ఎంపీటీసీ మమత మహేష్, కొలనూరు సింగిల్ విండో వైస్ చైర్మన్ కాశవేని మహేష్, ఉప్పుల అంజయ్య, వంగల శ్రీనివాస్ యాదవ్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీ అరికట్టాలి

సిరిసిల్ల రూరల్, మే 20: ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని సీఎం రేవంత్ రెడ్డి అరికట్టాలని ఏఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలనలో విద్యారంగం పూర్తిగా భ్రష్టుపోయిందన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బలోపేతం చేయాలన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మచ్చ రమేష్, సిరిసిల్ల జిల్లా కార్యదర్శి అంగురి రంజిత్, జిల్లా అధ్యక్షుడు రాము, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామారావు వెంకటేష్ పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో సీఎంపై అనుచిత వ్యాఖ్యలు

- చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట, మే 20: సోషల్ మీడియాలో సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతోపాటు కించపరిచేలా వ్యవరిస్తూ పోస్టు చేస్తున్న ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ నమిలికొండ శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశానని అదే గ్రామంలోని కాంగ్రెస్ నాయకుడు ఊడుగుల సురేందర్ సోమవారం తెలిపారు. రాజన్నపేట పేరిట ఉన్న వాట్సప్ గ్రూప్‌లో శ్రీనివాస్ సీఎం రేవంత్‌రెడ్డిని కించపరిచేలా పోస్టు చేస్తున్నారని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న శ్రీనివాస్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సురేందర్ కోరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు లక్ష్మారెడ్డి, భూపాల్‌రెడ్డి స్థానిక సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమాకాంత్ దృష్టికి తీసుకెళ్లారు. చర్యలు తీసుకోకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

కాంగ్రెస్ నాయకుడి జన్మదిన వేడుకలు

ఎల్లారెడ్డిపేట, మే 20: ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామంలో న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు పిట్టల భూమేశ్ జన్మదిన వేడుకలను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, బాలనర్సు, బాలయ్య, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ను అడ్డుకున్న గ్రామస్థులు

కోనరావుపేట, మే 20: కోనరావుపేట మండలం కనగర్తిలో సోమవారం గ్రామస్థులు ఇసుక రీచ్‌ను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ భారీగా ఇసుకను తరలిస్తున్నారని, భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని మండిపడ్డారు. ఇసుకరీచ్‌ను ఆపివేయాలని డిమాండ్ చేశారు.

నిలిచిన నాన్‌వెజ్ మార్కెట్ పనులు

- రోడ్డు పక్కన డబ్బాలు - స్తంభిస్తున్న రాకపోకలు



అర్ధంతరంగా నిలిచిన మాంసం అమ్మకాల కేంద్రం పనులు

ఎల్లారెడ్డిపేట, మే 20: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మాంసం అమ్మకాలకు మార్కెటు లేక పడుతున్న ఇబ్బందులను తీర్చేందుకు అధికారులు, అప్పటి ప్రజాప్రతినిధులు రెండేళ్ల కిందట స్థానిక గిద్దె చెరువు సమీపంలో చేపట్టిన మాంసం విక్రయాల సముదాయ కేంద్ర నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో మాంసం వ్యాపారులు మండల కేంద్రంలోని మొదటి బైపాస్ రోడ్డుకిరువైపుల డబ్బాలను ఏర్పాటు చేసుకొని విక్రయిస్తున్నారు. మాంసం అమ్మకాలు రోడ్డుపై నిర్వహిస్తుండడంతో రాకపోకలు స్తంభించిపోతున్నాయి. నిధులు మంజూరైనా పూర్తి స్థాయిలో పనులు చేయకుండానే మధ్యలో నిలిపివేశారు. దీంతో షెడ్డులో పిచ్చిమొక్కలు పెరిగాయి.

మండల కేంద్రంలోని గిద్దె చెరువు ప్రాంతంలో మాంసం మార్కెటుకు స్థలం కేటాయించడంతోపాటు రూ.10 లక్షల ఈజీఎస్, మరో రూ.5 లక్షల జీపీ నిధులను రెండేళ్ల కిందట అధికారులు, అప్పటి ప్రజాప్రతినిధులు కేటాయించారు. మాంసం అమ్మకాల సముదాయ నిర్మాణ పనులను రెండేళ్ల కిందట ప్రారంభించారు. పనులను మాంసం వ్యాపారుల్లోని మిర్యాల్‌కార్ శ్రీనివాస్‌కు అప్పగించారు. సొంత డబ్బులను వెచ్చించి పునాది, బేస్మెట్ స్థాయి వరకు పూర్తి చేశారు. రూ.3 లక్షల వరకు ఖర్చు చేశారు. అధికారులు బిల్లును సకాలంలో చెల్లించకపోవడంతో పనులను నిలిపి వేశారు. అధికారుల చుట్టూ తిరుగగా రూ.1.20 బిల్లును చెల్లించారు. దీంతో తనకు నష్టం వాటిల్లిందని ఆయన పనులను మధ్యలోనే ఆపేశారు. నారాయణపూర్‌లోని మరో కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించారు. గోడలు, రేకుల వరకు పనులను పూర్తి చేశారు. బిల్లులు రావడం లేదని పనులను నిలిపివేశారు. రెండేళ్ల కిందట ప్రారంభించిన మాంసం అమ్మకాల సముదాయ కేంద్రం నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో వినియోగంలోకి రాకుండాపోతోంది.

రోడ్డుపై అమ్మకాలు.. వాహనదారుల అవస్థలు

మండల కేంద్రంలోని మాంసం అమ్మకాల సముదాయ కేంద్ర నిర్మాణ పనులు నిలిచిపోవడంతో వ్యాపారులు మొదటి బైపాస్ రోడ్డుకు ఇరువైపుల డబ్బాలను ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. ప్రతీ శుక్ర, ఆదివారాలతోపాటు సంక్రాంతి, దసరా, మాఘ అమావాస్య పిత్రుఅమావాస్య రోజుల్లో డబ్బాల వద్ద మాంసం కోసం ప్రజలు బారులుదీరుతున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. ప్రమాదాలు చోటు చేసుకున్న సంఘటనలు ఉన్నాయి.

రహదారిపై వ్యర్థాలు

మండల కేంద్రంలోని మొదటి బైపాస్ రోడ్డుకిరువైపుల మాంసం వ్యాపారులు అమ్మకాలు సాగిస్తుండడంతో వ్యర్థాలను రోడ్డు పక్కన పడేస్తున్నారు. ఎముకలు, మాంసం వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడే వేయడంతో కుక్కలు, పందులు చేరుతున్నాయి. వ్యర్థాలతో కాలనీవాసులు దుర్వాసన భరించలేకపోతున్నారు. ఇప్పటికైనా పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు రావాలని కోరుతున్నారు.

రూ.1.80 లక్షలు నష్టపోయా

- మిర్యాల్‌కార్ శ్రీనివాస్



మాంసం అమ్మకాల కోసం షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని పనులను చేపట్టాం. మొదట రూ.3 లక్షల సొంత డబ్బులతో పనులను ప్రారంభించా. డబ్బులు చెల్లించలేదు. కార్యాలయం చుట్టూ తిరిగితే రూ.1.20 లక్షల బిల్లు మాత్రమే చెల్లించారు. పనులు చేసి రూ.1.80 లక్షలు నష్టపోయా.

సమస్య పరిష్కరిస్తాం

- దేవరాజు, పంచాయతీ కార్యదర్శి



మండల కేంద్రంలోని మొదటి బైపాస్ రోడ్డుకిరువైపుల మటన్ డబ్బాలను ఏర్పాటు చేసి మాంసం అమ్మకాలు సాగిస్తున్నారు. రోడ్డుపై వ్యర్థాలు పడేస్తుండడంతో పలుమార్లు వ్యాపారులను నోటీసులను జారీ చేశాం. గిద్దె చెరువు సమీపంలో మార్కెట్ షెడ్డు పనులను పూర్తి చేసి సమస్య పరిష్కరిస్తాం.

పనులు చేసేలా చర్యలు

- కొమురయ్య, ఏపీవో, ఈజీఎస్



మటన్ షెడ్డు నిర్మాణం కోసం రెండేళ్ల కిందట రూ.10 లక్షల ఈజీఎస్ నిధులను మంజూరు చేశాం. పూర్తి నిర్మాణానికి జీపీ మరో రూ.5 లక్షలు కేటాయించింది. పనులను చేసిన వాటికి రూ 3.10 లక్షలు బిల్లులు చెల్లించాం. వారంరోజుల్లో మరో రూ.2.05 లక్షలు చెల్లిస్తాం. పనులు పూర్తయ్యేలా చూస్తాం.

కార్యకర్తలకు బీఆర్ఎస్ అండ

వేములవాడ టౌన్, మే 20 : బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. వేములవాడ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ప్రమాదవశాత్తు మృతి చెందడంతో సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు ప్రమాదబీమా చెక్కును జడ్పీటీసీ మ్యాకల రవితో కలిసిఅంజేశారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా చూసుకుంటామన్నారు. జడ్పీటీసీ మ్యాకల రవి, చింతలఠాణ ఎంపీటీసీ ఆర్సీరావు నాయకులు నడిగొట్ల హరికృష్ణ, రాజిరెడ్డి, అలువాల పర్శరాములు, కట్ట శ్రీనివాస్, రవీందర్ తదితరలు ఉన్నారు.

రైతుపేరుతో రాజకీయం మానుకోవాలి

ఇల్లంతకుంట, మే 20: రైతుల పేరుతో రాజకీయం చేయడం మానుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పండించిన ప్రతీ ధాన్యపు గింజను కొనడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా కొంత మంది నాయకులు రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో రైతులు ఏవిధంగా నష్టపోయారో మర్చిపోలేదని తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏనాడూ రైతుల బాగోగులు పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతుల ప్రభుత్వమని తెలిపారు. యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, అధికార ప్రతినిధి పసుల వెంకటి ఉన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

తంగళ్లపల్లి, మే 20: తంగళ్లపల్లి పరిధిలోని భూమి కొనుగోలుతో మోస పూరితంగా ఇబ్బందులకు గురి చేస్తున్న ముగ్గురిపై సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన ఆరుకల లక్ష్మణ్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు తంగళ్లపల్లి మండలానికి చెందిన రంగు లచ్చమ్మ, రంగు రాములు, తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు.

21 మంది మందుబాబులకు జరిమానా

తంగళ్లపల్లి, మే 20: తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మద్యం తాగి వాహనాలు నడిపిన 21 మందికి సిరిసిల్ల మేజిస్ట్రేట్ జరిమానా విధించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మండలంలో గతంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 21 మందిని సిరిసిల్ల మేజిస్ట్రేట్ కోర్టులో సోమవారం హాజరు పరిచారు. ఒకరికి రూ.2వేలు, ఏడుగురికి రూ.1500, 13 మందికి వెయ్యి రుపాయాల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, మే 20: రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్, రాష్ట్ర కమిటీ సభ్యులు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండిసంజయ్‌కుమార్ పిలుపు మేరకు సోమవారం బీజేపీ నాయకులు కలెక్టరేట్‌కు తరలివచ్చి అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడగళ్ల వానకు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20వేల పరిహారంతోపాటు వంద రోజుల్లో రూ.2లక్షల రుణమాఫీ అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. రైతు భరోసా కింద ఒక ఎకరానికి రూ.15వేలు ఇవ్వలేదన్నారు. క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, కొండ నరేష్, బర్కం నవీన్‌యాదవ్, సుంకరి బాలకిషన్, గుండెల్లి వేణుగోపాల్, చొప్పదండి అంజన్న, అదిపెల్లి శ్రీనివాస్, ఉరగోండ రాజు తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లిలో..

తంగళ్లపల్లి: బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ వెంకటలక్ష్మీకి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు మాట్లాడుతూ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు కాశీ చరణ్, ఇటికల రాజు, ఇటికల మహేందర్, ప్రశాంత్, బ్రహ్మచారి, నవీన్ తదితరులు ఉన్నారు.

ముస్తాబాద్‌లో..

ముస్తాబాద్: రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ముస్తాబాద్ మండల బీజేపీ అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ సురేశ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ మాట తప్పిందన్నారు. రైతు భరోసా కింద ఒక ఎకరాకు రూ.15వేలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. వడగళ్లవానతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సంజీవ్, మెంగని మహేందర్, మీస స్వామి, చీకోటి మహేశ్, ఓరగంటి సత్యం, కరుణాకర్ పాల్గొన్నారు.

వీర్నపల్లిలో..

వీర్నపల్లి: ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ జిల్లా ఎస్టీ మోర్చా నాయకుడు, శక్తి కేంద్రం ఇన్‌చార్జి రమేష్ నాయక్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో రైతుల హామీలను వెంటనే నెరవేర్చాలంటూ తహసీల్దార్ ఉమారాణికి సోమవారం వినతిపత్రం అందజేశారు. వడగళ్ల వానకు పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20 వేల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల రుణమాఫీ హామీని తక్షణమే అమలు చేయాలన్నారు. రైతు భరోసా, రైతు బోనస్ పథకాలను అందించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తిరుపతి, నరేష్, సతీష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో..

వేములవాడ టౌన్: వేములవాడ పట్టణంతోపాటు మండలంలోని రైతులు పండించిన ధాన్యాన్ని జాప్యం, ఆంక్షలు కొనుగోలు చేయాలని బీజేపీ నాయకులు సోమవారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీపట్టణ అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించి రోజులు గడుస్తున్నాయని, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తక్షణమే రైతుల ధాన్యం కొనుగోలు చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోల కృష్ణస్వామి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, మండల అధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వర్‌రావు, జిల్లా కార్యదర్శి బుర్ర శేఖర్ నాయకులు అక్కనపెల్లి వివేక్‌రెడ్డి, సంటి మహేష్, గడ్డమీద శ్రీనివాస్, పిన్నింటి హన్మాండ్లు, జింక అనిల్, రాజ్‌కుమార్, నామాల శేఖర్ తదితరలు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కోనరావుపేటలో..

కోనరావుపేట: రైతుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గొట్టే రామచంద్రం డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ విజయ రామారావుకు వినతి పత్రం అందజేశారు. బీజేపీ నాయకులు మిర్యాల్‌కార్ బాలాజీ, బెంద్రె శ్రీనివాస్, మోత్కు మోహన్ పాల్గొన్నారు.

చుందుర్తిలో..

చందుర్తి: ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా పూర్తి చేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు పొంచెట్టి రాకేష్ అన్నారు. చందుర్తి బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరిస్తూ, కొనుగోళ్లు వేగవంతం చేయాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు ఇప్పటికీ పూర్తి కాలేదని, అకాల వర్షాలతో రైతుల ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శులు చింతకుంట గంగాధర్, చిర్రం తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

రుద్రంగిలో..

రుద్రంగి: రైతాంగంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపిస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేష్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో సోమవారం రైతుల సమస్యలపైన తహసీల్దార్ శ్రీలతకు వినతి పత్రం అందదజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడగండ్ల వర్షానికి నష్టపోయిన రైతులకు రూ.20 వేల చొప్పున నష్ట పరిహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పడాల గణేష్, అల్లూరి రవీందర్, బోయిని రాజు, మీసాల రవీందర్, నితిన్, నరేష్, వేణు, తదితరులు పాల్గొన్నారు.